క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి జాన్‌వెస్లీ కృతజ్ఞతలు



వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న జాన్ వెస్లీ

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ రెండోసారి నియమితులైన సందర్భంగా ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జాన్‌వెస్లీకి పలువురి అభినందనలు

డాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా రెండో దఫా నియమితులైన బొల్లవరపు జాన్‌వెస్లీని ఆదివారం రాష్ట్ర నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత సత్యనారాయణ, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు మాసిపోగు మేరీజోన్స్, బిపిన్‌కుమార్ జైన్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, 32వ వార్డు అధ్యక్షుడు మూలే రామిరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు సనపల రవీంద్రభరత్, దొడ్డి రామానంద్, మహిళా నాయకులు సలాది భాను, కె. వినీతరెడ్డి తదితరులు అభినందించారు.

సీఎం జగన్ పాలనలో మత్స్యకారులకు గుర్తింపు



కోలా గురువులును సత్కరిస్తున్న వాడబలిజ సంఘం నాయకులు

జగదాంబ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు ప్రత్యేక గుర్తింపునిచ్చారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఆదివారం జీవీఎంసీ 39వ వార్డు ఎంవీడీఎం పాఠశాల ఎదురుగా ఉన్న వాడబలిజ సంఘం భవనానికి ప్రారంభోత్సవం చేసిన ఆయనను ఆ సంఘం పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ మత్స్యకారులకు ఎటువంటి సహాయం కావల్సి వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విశాఖ టైల్స్ అండ్ శానిటరీ వేర్ అసోసియేషన్ సభ్యులు

సీతమ్మధార : విశాఖ టైల్స్ అండ్ శానిటరీ వేర్ అసోసియేషన్ తరపున ప్రతి ఆరు నెలలకు ఒకసారి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీ రామకృష్ణారావు అన్నారు. 27వ వార్డు శ్రీనగర్‌లో ఆదివారం ఉచిత మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కిడ్నీ బాధితుడికి, క్యాన్సర్ పేషెంట్‌కి ఆర్థిక సహాయం చేశామన్నారు. రక్తదానం చేయడానికి తమ అసోసియేషన్ సభ్యులు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. అసోసియేషన్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు, కోశాధికారి సంజయ్, ప్రతినిధులు రామోజీరావు, బద్రి ప్రసాద్, ఆసిఫ్ అలీ, ఆర్‌కే ప్రసాద్, నాగేశ్వరరావు, రాజా, రమణవర్మ, శేషు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటరు నమోదు ప్రక్రియ

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డులో ఓటరు నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఈ మేరకు వుడా కాలనీలోని నాలుగు పోలింగ్ బూత్‌లకు సంబంధించి రెండు రోజులపాటు వుడా కమ్యూనిటీ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం 100 మంది వచ్చి తమ ఓటు ఉందో లేదో ఆసక్తిగా తెలుసుకున్నారని బీఎల్వో సూర్య తెలిపారు.

జగనన్న సురక్షతో.. ఆరోగ్య భరోసా

- మంత్రి విడదల రజని



మిసెస్ మామ్ కార్యక్రమానికి హాజరైన మంత్రి విడదల రజని, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం తీర్చిదిద్దిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎందరో బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. ఆదివారం మహారాణిపేట అఫీషియల్ కాలనీలో గల ఓం శాంతి మెడిటేషన్ సంస్థలో నిర్వహించిన మిసెస్ మామ్ (నార్మల్ డెలివరీ ప్రమోట్ ఇనీషియేట్) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు. శివలీల సిస్టర్ ఆధ్వర్యంలో డాక్టర్ శిల్పారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి రజని మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 7 రకాల పరీక్షలు చేయడంతో పాటు పేదలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. నేరుగా ప్రజల చెంతకే వెళ్లి వైద్యం అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి అంగన్‌వాడీ స్కూళ్ల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. తద్వారా పుట్టే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటాడన్నారు. పిల్లలు పుట్టిన ఆరేళ్ల వరకు వారికి ప్రభుత్వం ఉచితంగా పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ముందుగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్రతో కలిసి మంత్రి రజని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అభివృద్ధిపై విస్తృత ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

డాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే కార్యక్రమంతో పాటు సామాజిక న్యాయ బస్సు యాత్ర కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైవీ మాట్లాడుతూ సామాజిక న్యాయ బస్సు యాత్ర, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాల గురించి ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు గుడిమెట్ల రవికుమార్, ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు, జేసీస్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని చిట్టివలస లేబర్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 946వ శిబిరానికి హాజరై ఆయన మాట్లాడారు. నగరంలోని అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక తాటిపైకి వచ్చి పోరాడుతున్నారన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు ముందు తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, చిల్లరాం, వై.కొండయ్య, సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య యువజన సంఘం వార్షికోత్సవం

డాబాగార్డెన్స్ : ఆర్యవైశ్య యువజన సంఘం గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 50 ఏళ్ల కిందట అప్పటి సంఘ పెద్దలు ముందు చూపుతో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య యువజన సంఘం ఎదుగుతూ సంఘ ఆశయాలు ముందుకు తీసుకెళ్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నల్లూరి నూకరాజు, కార్యదర్శి పూసర్ల సురేష్ కుమార్, ప్రోగ్రామ్ చైర్మన్ వి. శ్రీనివాసరావు, సంఘం కోశాధికారి గ్రంధి దుర్గాప్రసాద్, ఆరిశెట్టి దినకర్, రామకృష్ణారావు, శివకుమార్, ఉప్పల భాస్కరరావు, విన్నకోట రామ్మూర్తి, కందుల మూర్తి, ఎలమర్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నినదిస్తూ యువ చైతన్య కార్యక్రమం



యువచైతన్యం కార్యక్రమంలో పాల్గొన్న ఆర్గనైజేషన్ ప్రతినిధులు

సీతమ్మధార : లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్, ఎంసీ మీడియా కంపెనీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'టాక్ ఫర్ ది నేషన్' పేరుతో యువచైతన్య కార్యక్రమం చేపట్టారు. సంస్థ నిర్వాహకుడు ఫణిరాజ్ మాట్లాడుతూ 'వాయిస్ ఫర్ వాయిస్ లెస్' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నామని, సమాజంలో ఉన్న సామాన్యులు, యువత సమస్యలపై తమ వంతు పోరాటం చేస్తున్నామన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక దండి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఎన్‌పీఎస్ రద్దు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వికాస్ రావల్

డాబాగార్డెన్స్ : నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్) వల్ల కార్మికులకు ఎటువంటి లాభం లేకపోగా నష్టమేనని జేఎన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వికాస్ రావల్ అభిప్రాయపడ్డారు. పీపుల్ ఫర్ ఇండియా విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం ఎల్ఐసీ ప్రాంగణంలో ఎన్‌పీఎస్ రద్దు–అందరికీ ఓపీఎస్ పేరిట సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2004 వరకు ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం అమలయ్యేదని, అది కూడా చాలా పోరాటాల ఫలితంగానే వచ్చిందన్నారు. ప్రభుత్వం మాత్రం ప్రజలకు సామాజిక భద్రతగా పెన్షన్ అందించే బాధ్యత నుంచి వైదొలుగుతుందన్నారు. ఎన్‌పీఎస్ జమ అయిన నిధులను స్టాక్‌మార్కెట్‌లో, ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెడుతుందన్నారు. ఎంత పెన్షన్ వస్తుందో కూడా తెలియని అయోమయంలో ప్రజలు ఉన్నారన్నారు. ఐక్య పోరాటాల వల్ల మాత్రమే ఎన్‌పీఎస్ రద్దు, ఓపీఎస్ సాధన సాధ్యమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజాశర్మ, జి. వరప్రసాద్, అప్పారావు, అరుణ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సదస్సులో ఎం. కామేశ్వరి, ఎన్. రామకృష్ణ, ఏవీఆర్‌కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



జస్టిస్ నాగార్జున రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చింతపల్లి రాంబాబు

విశాఖ–లీగల్ : రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డిని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు ఆదివారం విశాఖలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. న్యాయస్థానాల్లో విద్యుత్ కొరత, కక్షిదార్ల ఇబ్బందులు, న్యాయవాదుల సంఘానికి విద్యుత్ వినియోగం, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై చర్చించారు.

రైలు ప్రమాద బాధితులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

తాటిచెట్లపాలెం : రైలు ప్రమాద బాధితులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ బృంద సభ్యులు విశేష సేవలు అందిస్తున్నారు. వాల్తేర్ డివిజన్ కంటకాపల్లి–అలమండ వద్ద ఇటీవల రైలు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. విజయనగరం, విశాఖపట్నంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు వాల్తేర్ డివిజన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బృంద సభ్యులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వీరి సేవల పట్ల బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్రా యాత్రికులకు సత్కారం



ఉమ్రా యాత్రికులను సత్కరిస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కేవీ బాబా

తాటిచెట్లపాలెం: పవిత్ర పుణ్య క్షేత్రం మక్కా–మదీనాలను దర్శించుకునేందుకు ఈ నెల 11న బయల్దేరనున్న ఫతే అహ్మద్, నాగూర్ మీరాలను జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కేవీ బాబా ఆదివారం ఘనంగా సత్కరించారు. రైల్వే న్యూకాలనీలోని ఫతేఅహ్మద్, నాగూరుమీరాలను వారి స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానం చేశారు. వీరిద్దరూ ఈ పవిత్ర యాత్రను ముగించుకుని నవంబరు చివరి వారంలో విశాఖకు రానున్నారు. ఈ సందర్భంగా కేవీ బాబా మాట్లాడుతూ ఈ పవిత్ర ఉమ్రా యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు హైదర్ ఆలీ సింకా, హాజీ ఖాదర్ బాబా, బాదర్‌బాబా, జిలానీ, తాజుద్దీన్, కాలేష బాబా, బర్కత్ అలీ, షరీఫ్, రెహ్మాన్, వలి, చోటు, ఆయుబ్, ముస్తఫా, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం : విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. సోమవారం నుంచి 12వ తేదీ వరకు గుంటూరు–రాయగడ (17243)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 13వ తేదీ వరకు రాయగడ–గుంటూరు (17244)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 12వ తేదీ వరకు మచిలీపట్నం–విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్,13వ తేదీ తేదీ వరకు విశాఖ–మచిలీపట్నం (17220)ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు విజయవాడ– విశాఖ– విజయవాడ (12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు కాకినాడ–విశాఖ– కాకినాడ (17267/17268) మెము స్పెషల్ రైళ్లు రద్దు చేశారు.

పలు రైళ్ల గమ్యం కుదింపు..

సోమ,మంగళవారాల్లో విశాఖలో బయల్దేరే విశాఖ–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్–విశాఖ(18513)ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 9తేదీల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. సోమ,మంగళవారాల్లో హౌరాలో బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005)సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా 7,8 తేదీలలో కోరాపుట్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

నాందేడ్ –విశాఖపట్నం రీషెడ్యూల్

ఆదివారం నాందేడ్‌లో సాయంత్రం 4.30గంటలకు బయల్దేరవలసిన నాందేడ్–విశాఖ(20812) సూపర్ ఫాస్ట్ స్పెషల్ పెయిరింగ్‌రైలు రాక ఆలస్యంగా రాత్రి 8.30గంటలకు బయల్దేరింది.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కుటుంబ సమేతంగా ఈ పూజలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్త శతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో భారీ చోరీ



ఇంట్లో చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని క్వార్టర్స్‌లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ విభాగంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీనివాస్ టౌన్‌షిప్ సెక్టార్–1లోని 149–డీ క్వార్టర్‌లో కుటుంబంతో నివశిస్తున్నారు. యథావిధిగా శనివారం రాత్రి తలుపులు వేసిపడుకున్నారు. తెల్లవారి లేచి చూడగా ఇంటి హాల్లో వస్తువులు చిందర వందరగా పడిఉన్నాయి. ప్రధాన ద్వారం ముందు వైపు గడియ పెట్టి ఉంది. తనిఖీ చేయగా ఇంట్లో ఉండాల్సిన సుమారు 10 నుంచి 12 తులాల బంగారం వస్తువులు, 10 తులాల వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ మాయమయ్యాయి. దీంతో వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. దొంగలు దిగువన ఉన్న పైపును పట్టుకుని పైఅంతస్తుకు వచ్చి వెనుక ద్వారం గుండాలోనికి ప్రవేశించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉద్యోగి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రజాసేవే పరమావధిగా..

- మీ ఇంటికి మీ కార్పొరేటర్ కార్యక్రమం
- వినూత్న రీతిలో సేవలందిస్తున్న 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



యాతపేట సచివాలయం పరిధిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ పద్మావతి



యాతపేటలో రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

అల్లిపురం : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అక్టోబర్ 4వ తేదీన ప్రారంభించిన మీ ఇంటికి మీ కార్పొరేటర్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రోజుకి ఒక వలంటీర్ చొప్పున యాతపేట సచివాలయం పరిధిలో 19 మంది వలంటీర్లతో కలిసి 924 ఇళ్లకు స్వయంగా వెళ్లి ప్రజలతో మమేకం అయ్యారు. దీంట్లో భాగంగా యాతపేట సచివాలయం పరిధిలో వలంటీర్లు, కన్వీనర్లు పిల్లి సత్తిబాబు, లక్ష్మణరావు (వైట్), వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, తాతబ్బాయి, మహిళా అధ్యక్షురాలు రాములమ్మ ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి..

సచివాలయం పరిధిలో వీధి దీపాలు, రోడ్లు, మంచినీరు, పారిశుధ్యం తదితర సమస్యలపై ప్రజల ముంగిట నుంచే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. దీంతో ప్రజలు కార్పొరేటర్ పనితీరును, పార్టీ విధానాన్ని కొనియాడుతున్నారు.

జగనన్న స్ఫూర్తితోనే..



జగనన్న స్ఫూర్తితోనే నేను ప్రజలతో మమేకమవుతున్నాను. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలు తెలుసుకుందామని మీ ఇంటికి మీ కార్పొరేటర్ కార్యక్రమం చేపట్టాం. గత నెల 4వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఒక సచివాలయం పరిధిలో 924 ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నాను. వాటిని నా స్థాయిలో పరిష్కరించగలగడం ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని నిత్యం కొనసాగిస్తాను.

– తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

మంచి నీటి సమస్య పరిష్కరించారు..



వార్డు పర్యటనలో భాగంగా స్థానిక కార్పొరేటర్ తోట పద్మావతి మా ఇంటికి వచ్చారు. మంచినీటికి ఇబ్బందిగా ఉందని చెప్పిన వెంటనే అధికారులతో మాట్లాడి తక్షణమే పైప్‌లైన్ వేయించారు.

– ధనమ్మ, యాతపేట

వీధి దీపాలు వేయించారు..



వీధిలో చీకటి పడితే ఇబ్బందిగా ఉంటుంది. ఉన్న ఒక్క లైటు వెలగనప్పుడు కార్పొరేటర్ పద్మావతికి తెలిపాం. ఆమె విద్యుత్ సిబ్బందితో మాట్లాడి మరొక లైట్ అదనంగా వేయించి అడిగిన వెంటనే సహాయం చేశారు. ధన్యవాదాలు.

– కనకరాజు, యాతపేట

డ్రైనేజీలు క్లీన్ చేయించారు..



కార్పొరేటర్ ఇంటింటికీ వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని చెప్పిన వెంటనే సిబ్బందిని పిలిపించి డ్రైనేజీ శుభ్రం చేయించారు. చెత్త తొలగించి ఫాగింగ్ చేయించారు. అడిగిన వెంటనే పనులు చేసిపెడుతున్న మా కార్పొరేటర్ పద్మావతికి ధన్యవాదాలు.

–పి.నాగమణి, యాతపేట

అప్పన్నను దర్శించుకున్న ఇరాన్ అధికారి



అప్పన్న సన్నిధిలో డాక్టర్ ఫరిబోర్జ్ అబ్బాసి తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఇరాన్ ప్రభుత్వ వ్యవసాయ మంత్రి సలహాదారు డాక్టర్ ఫరిబోర్జ్ అబ్బాసి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ ఆయనకు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.